బెల్టు జోరు



నమ్మిదొడ్డి జంక్షన్‌లోని వైన్ షాపు నుంచి బెల్టు దుకాణానికి తరలిస్తున్న మద్యం

- లైసెన్స్ దుకాణాల నుంచే మద్యం సరఫరా
- అనుమతులు లేకుండానే పర్మిట్ రూమ్‌లు
- చర్యలు తీసుకోని అధికారులు
- మండిపడుతున్న మహిళలు

మద్యం ఏరులై పారుతోంది. 24/7 మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. బెల్టుషాపులు తెల్లవార్లూ బార్లా తెరుచుకొని ఉంటున్నాయి. దీంతో మందుబాబులు పూటుగా తాగి ఊగుతూ తూగుతూ రోడ్లపై కనిపిస్తున్నారు. మరికొందరైతే మందు ఎక్కువై అక్కడే పడిపోతున్నారు. మండలంలోని లైసెన్స్ దుకాణాల నుంచి బెల్టు షాపులకు పెద్ద ఎత్తున మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో సందుకో బెల్ట్ షాపు కనిపిస్తోంది.. వీటిని అరికట్టాల్సిన అధికారులు నిద్ర నటిస్తుండడంతో ఇక్కడ వ్యాపారం మూడు బీరు బాటిళ్లు.. ఆరు బ్రాందీ బాటిళ్లు అన్న చందంగా సాగుతోంది. – పెదగంట్యాడ



పిట్టవానిపాలెంలోని ఓ బెల్టు దుకాణం వద్ద ఉదయాన్నే మద్యం సేవిస్తున్న మందుబాబులు

తూతూ మంత్రంగా తనిఖీలు

పేపర్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేసి వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు. అనధికార పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి పచ్చనోట్లు అందడంతో మిన్నకుండిపోతున్నారని విమర్శిస్తున్నారు. అనధికార మద్యం విక్రయాలపై ఎవరైనా సమాచారం ఇచ్చేందుకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత అధికారులు నిద్ర నటిస్తున్నారు. బెల్టు షాపులను బహిరంగగానే టేబుల్స్ వేసి మరీ నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టు దుకాణాలు నిర్వహించడం నేరం. అయితే మద్యం వ్యాపారం పరపతి ఉన్న వారి చేతుల్లోకి వెళ్లడంతో ఎక్కడ పడితే అక్కడ బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వారి షాపుల నుంచి మద్యాన్ని బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం వైన్ షాపులకు దీటుగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. ఆ షాపుల్లో వైన్ షాపుల్లో దొరికే అన్ని రకాల బ్రాండ్లు లభ్యమవుతున్నాయి. క్వార్టర్, బీరు పై అదనంగా రూ. 50 నుంచి రూ.100 వరకూ వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఉండగా, బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకూ తెరిచి ఉంటున్నాయి. అయితే బెల్టు దుకాణాలు మాత్రం 24 గంటలూ తెరిచే ఉంటున్నాయి.



మదీనాబాగ్‌లో బహిరంగంగానే మద్యం సేవిస్తున్న మందు బాబులు



పెదగంట్యాడలో ఓ వైన్ షాపు నుంచి బెల్టు దుకాణానికి తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన మద్యం

మందుబాబుల నుంచి సంపద సృష్టి

ఎన్నికల ముందు వచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం మద్యాన్ని మాత్రం అందుబాటులో ఉంచుతోంది. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విధంగా మద్యం ప్రియుల నుంచి పిండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైన్ షాపులే.. మినీ బార్లు

గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు మేలు చేసే విధంగా మద్యం దుకాణాలను నిర్వహించింది. అది కూడా నిర్ణీత సమయాల్లో మాత్రమే విక్రయాలు చేపట్టగా.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం పాలసీని ప్రైవేటు పరం చేసింది. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు విచ్చల విడి విక్రయాలకు తెరలేపారు. ఆ దుకాణాల వద్దే పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అవి కాస్తా మినీ బార్లను తలపిస్తున్నాయి. రాత్రి 11 వరకూ సిట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడడం లేదని మహిళలు మండిపడుతున్నారు.

పట్ట పగలే లోడింగ్

మద్యం దుకాణం నుంచి పట్టపగలే ద్విచక్ర వాహనాలు, ఆటోలపై లోడ్ చేసి మద్యం తీసుకువెళ్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పెదగంట్యాడలోని సిద్దేశ్వరం, పెదగంట్యాడ మెయిన్ రోడ్డు, అరుణా థియేటర్ ఎదురుగా, హౌసింగ్ బోర్డు కాలనీ, మదీనాబాగ్, నమ్మిదొడ్డి తదితర ప్రాంతాల్లోని మద్యం వ్యాపారులు అనధికారికంగా వైన్ షాపుకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసి అక్కడే మద్యం తాగిస్తున్నారు. అక్కడే బార్లను తలపించేలా సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులు, బెల్టు దుకాణాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



హౌసింగ్ బోర్డు ప్రధాన రహదారిలో ఉన్న వైన్ షాపు పక్కనే బహిరంగంగా...

బెల్టు దుకాణాల్లో..

వైన్ షాపుల్లో ప్రతి రోజూ మద్యం విక్రయాలు 60 శాతం వరకూ ఉంటే, బెల్టు దుకాణాల్లో మాత్రం 40శాతం వరకూ విక్రయాలు సాగుతున్నాయని తెలుస్తోంది. చిన్న చిన్న కుటుంబాల మధ్య ఈ దుకాణాలు చిచ్చురేపుతున్నాయి. రోజంతా కష్టపడి పని చేయగా వచ్చిన సొమ్మును బెల్టు దుకాణాల్లోని మద్యానికి తగలేస్తున్నారంటూ ఆ కుటుంబ సభ్యులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో సుమారు 59 గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో నాలుగు బెల్టు షాపులకు తక్కువ లేకుండా ఉన్నాయంటే..అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో చెప్పనవసరం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



బాబాకు పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, తిప్పల ఎమిలి జ్వాల తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల నితీష్‌రెడ్డి, ప్రణీత ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు వెలవలపల్లి నాగబాబు ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన, సామూహిక బాబా పూజ, భస్మాభిషేకం, పూర్ణాహుతి జరిపారు.బాబాను వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి,తిప్పల ఎమిలీ జ్వాల దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో 75వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో అన్నసమారాధన

కూర్మన్నపాలెం: స్థానిక సిద్ధార్థనగర్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.గోవింద్ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నాయకులు రామారావు, అప్పలరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



శ్రీనివాసరావు,రమ దంపతులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కులో సుదీర్ఘకాలం పని చేసి, స్టీల్‌ప్లాంట్ ఉన్నతి కోసం పాటుపడిన కులుకూరి శ్రీనివాసరావు శేష జీవితం ఆనందంగా సాగాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బొడ్డు కృష్ణారావు, కులుకూరి మంగరాజు అన్నారు. ఎస్‌బీఎం డిపార్టుమెంట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కులుకూరి శ్రీనివాసరావు, రమ దంపతులను నడుపూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బెల్లాల నాగేశ్వరరావు, బచ్చు సోమరాజు, నరసింహమూర్తి కారుమూరి మహేష్, కులుకూరి వాసు, మండవిల్లి శ్రీను, ప్రభోజీ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలోనే సంతృప్తి



మాట్లాడుతున్న కృష్ణంరాజు

అగనంపూడి: మానవతా చారిటబుల్ ట్రస్ట్ అగనంపూడి పరిసర ప్రాంతాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మానవతా చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణంరాజు కొనియాడారు. అగనంపూడి సాయినగర్ కాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ట్రస్ట్ స్థానిక కమిటీలు చేపడుతున్న సేవా కార్యక్రమాలు వివరించారు. పేదలకు సాయం చేయడంలో సంతృప్తి ఉందని చెప్పారు. ట్రస్ట్ కన్వీనర్ ఎం.వి.సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు జీఎస్ఎన్ రాజు, ప్రాంతీయ కార్యదర్శులు వాసు, బుచ్చిరాజు, పావని, సన్ని, జంపాన లక్ష్మి పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న డాక్టర్ కల్యాణ్ తదితరులు

గాజువాక: సింహగిరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సింహగిరి ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ కె.వి.రామన్ వర్ధంతి సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ జమునారాణి, ఆస్పత్రి ఎండీ డాక్టర్ కె.వి.ఎస్.కల్యాణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డీ.గౌస్, ట్రస్టు ప్రతినిధులు డాక్టర్ సంగీత లక్ష్మి, మౌనిక, బాలు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న 13వ జిల్లా అదనపు న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ నెల 5న నిర్వహించనున్న లోక్ అదాలత్ శిబిరంలో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు కోరారు. శిబిరం నిర్వహణపై కోర్టు కాంప్లెక్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించడం వల్ల లభించే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల పరిష్కారానికి పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ మార్గంద్వారా పరిష్కరించుకున్న కేసులకు అప్పీలు కూడా ఉండదన్న విషయాన్ని కక్షిదారులకు వివరిస్తే ఎక్కువమంది ఈ శిబిరాన్ని ఉపయోగించుకుంటారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.కవిత, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమని, పలువురు సీఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉక్కుపై కేంద్రం నిర్ణయం తగదు



దీక్షా శిబిరంలో సీఐటీయూ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోకపోవడం దారుణమని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని మిగిలిన కర్మాగారాలపై ప్రభుత్వం తమ ప్రతిపాదనను వెనక్కి తీసుకుందని వారు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో సోమవారం యూనియన్ నాయకులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సముద్ర తీరప్రాంతంలో ఉన్న ప్లాంటులు మూతపడిన సందర్భాలు లేనే లేవని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం సముద్ర తీరాన ఉండడం వల్ల విదేశీ ఎగుమతులు, దిగుమతుల వ్యయం భారీగా తగ్గుతుందన్నారు. అందువల్ల పెట్టుబడిదారుల కన్ను విశాఖ ఉక్కుపై పడిందని వారు తెలిపారు. అందు వల్లే ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకొచ్చి కర్మాగారాన్ని కైవసం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగానే సొంత గనులు కేటాయించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటరావు, నమ్మిరమణ, వి.వి.రమణ తదితరులు పాల్గొనారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు పారితోషికం



ముగ్గురు విద్యార్థులకు నగదు అందిస్తున్న హెచ్‌ఎం ప్రమీల, సిబ్బంది

పెదగంట్యాడ: ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు దాతలు, ఉపాధ్యాయులు నగదు పారితోషికం అందించారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అగనంపూడికి చెందిన దాతలు విందుల వెంకటరమణ, గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ), కొలిపాక అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణతోపాటు ఉపాధ్యాయులు కలిసి ఎంపికైన కె.వర్షిత, నికితా బహద్దూర్, ఎ.సౌజన్యలకు రూ.పది వేల నగదు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రమీల మాట్లాడుతూ పాఠశాల నుంచి మొదటి సారిగా ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఆదిశగా కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులకు సత్కారం

ఇస్లాంపేట నుంచి బదిలీపై వివిధ పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, అలాగే వివిధ పాఠశాలల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు హక్, ఆనంద్, శ్రీనివాసరావు, బ్రహ్మానందం, డీఎస్ మూర్తి, రిజ్వాన్, రాజేష్, కె.పి.రావు, హేమలత, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం



దిబ్బపాలెంలో మొక్కలు నాటుతున్న సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

అగనంపూడి: సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు మిలియన్ మొక్కలు నాటాలని సంకల్పించామని ప్రేమ తరువులు ఇన్‌చార్జి బాబూరావు చెప్పారు. 85వ వార్డు దిబ్బపాలెం లలితానగర్ కాలనీలో అగనంపూడి సత్యసాయి భజన మండలి వంద మొక్కలు నాటింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నంబర్ 23 నాటికి లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. ఏడాది పొడువునా కాలుష్య నివారణకు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. ఎవరైనా మొక్కలు నాటాలనుకొనేవారు ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అగనంపూడి ప్రతినిధులు విందుల పైడినాయుడు, ప్రజా సంఘాల నాయకులు పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, కసా పద్మరాజు, విందుల వరహాలు, బి.వి.సుబ్బారావు జయ పాల్గొన్నారు.

ఫార్మా కాలనీలో పెట్రోల్ దొంగల బెడద

పెట్రోలింగ్ చేయాలని పోలీసులకు కాలనీవాసులు వినతి

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫార్మాసిటీ నిర్వాసితకాలనీల్లో పెట్రోల్ దొంగలు వాహనచోదకులను బెంబేలెత్తుతున్నారు. ఉదయం లేచి విధులకు వాహనంపై వెళ్లేందుకు ఉపక్రమించే సమయంలో పెట్రోల్ ట్యాంక్‌లో ఇంధనం ఖాళీ అవుతుండడంతో షాక్ అవుతున్నారు. రహదారులతో పాటు ఇంటి ఆవరణల్లో ఉంచిన వాహనాల నుంచి కూడా పెట్రోల్ చోరీ చేస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని కోరుతున్నారు. ఇదే విషయమై వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్‌లు దువ్వాడ సీఐకి ఫిర్యాదు చేశారు.

పీజీఆర్ఎస్‌కు 12 వినతులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వివిధ వార్డుల నుంచి 12 వినతులు అందాయి. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కలను నివారించాలని కోరుతూ ఆయా కాలనీలకు చెందిన నివాసులు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతి పత్రాలు అందజేశారు. వినతులను స్వీకరించిన జోనల్ కమిషనర్ శేషాద్రి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు.

డంపింగ్ యార్డు తరలించాలని వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

గాజువాక: జీవీఎంసీ 76వ వార్డు పరిధి గంగవరంపోర్టు రోడ్‌లో ఉన్న జీవీఎంసీ డంపింగ్ యార్డును తరలించాలని, పోర్టు కాలుష్యాన్ని నివారించాలని ఆ వార్డు జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు వార్డు జేఏసీ నాయకులు, కార్పొరేటర్ గంధం శ్రీను తదితరులు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. డంపింగ్ యార్డు వల్ల 16 గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు తరలింపు కోసం ఐదేళ్లుగా పోరాడుతున్నామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో జేఏసీ నాయకులు రంబ నారాయణమూర్తి, రాంబాబు, సత్యనారాయణ, గోవిందరావు, అశోక్, నారాయణరావు తదితరులున్నారు.

నోట్‌పుస్తకాలు, బ్యాగ్‌ల అందజేత

అగనంపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు ఉచితంగా నోట్‌పుస్తకాలు, బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వసతులను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. పెదమడక పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారయణ, డి.సుబ్బారావు, ఉపాధ్యాయులు కె.పార్థసారథి, బి.అనురాధ, బి.నిర్మల పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసిత సంఘం నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఉక్కు నిర్వాసితుల కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, నిర్వాసితుల ఐక్య సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు పితాన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, అప్పలరెడ్డి, రాజు, గణేష్, శ్రీనివాస్, అప్పలరాజు, ప్రసాద్ ఉన్నారు.

సందడే సందడి



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద కార్ల సందడి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద సోమవారం ఉద్యోగుల బంధువులతో సందడి నెలకొంది. ఉదయం నుంచి ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. స్టీల్‌ప్లాంట్ నుంచి జూన్‌లో 238 మంది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు ప్లాంట్‌కు చేరుకున్నారు. అక్కడ తనిఖీలు పూర్తి చేసుకుని ఆయా విభాగాలకు చేరుకున్నారు. దీంతో ప్లాంట్‌లోని అన్ని విభాగాలు బంధువుల సందర్శనతో సందడిగా మారాయి. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల రిటైర్‌మెంట్ కార్యక్రమం వీక్షించిన అనంతరం మెయిన్ గేటు వద్ద ఫొటోలు తీసుకుంటూ ప్లాంట్‌కు వీడ్కోలు పలికారు.